22

# హత్య

రాఘవయ్య మేష్టారు చనిపోయారుట!

అది చావు కాదు, హత్య.

అదీ – మామూలు హత్యకాదు. దారుణహత్య. గొడ్డలితో పీక నరికి మరీచంపారు.

అంత దారుణమైన హత్యకు గురికావాల్సిన అపరాధం ఆయన ఏం చేశాడో అర్థం కాదు. ఆయన ఒకరికి అపకారం చేసే మనిషి కానేకాదు. సాటి మనిషిని ఆదరించి ఆపదలో ఆదుకునే మనిషే కాని, హత్యకు గురి కావల్సిన 'కాపురుషుడు' కాడు, ధనసాయం, మాట సాయం ఎవరికి ఏదికావల్సివచ్చినా ఆయన్నుంచి తిరస్కృతి రాదు.

అలాంటి రాఘవయ్య గారిని చంపేశారు.

ఆయనకు వెనక కావల్సిన బంధువులు ఎవరైనా ఉన్నారో, లేదో తెలీదుగాని, నాకుమాత్రం ఇంట్లోమనిషి పోయినట్లే అనిపించింది.

రాఘవయ్యగారితో నా పరిచయం కాకతాళీయంగా జరిగింది.

ఇంటర్వ్యూకని హైదరాబాదు వస్తూ విజయవాడలో బస్సెక్కాను. బస్సంతా నిండిపోయింది. ఒకే ఒక్క సీటు ఖాళీగా ఉంది. అది ఆయన పక్క సీటు. దగ్గరికి వెళ్లగానే పక్కకు జరిగి-

"రండి" అని ఆహ్వానించాడు.

మనిషి సన్నగా, పొడుగ్గా ఉంటాడు. చామనఛాయ, పంచె కట్టుకుని, పొడుగు చేతుల చొక్కా వేసుకుని చేతులు మడత పెట్టుకున్నాడు.

బస్సు కదిలి సాగిపోతోంది. కాని మా మధ్య మాటల్లేవు. కొన్ని గంటల తర్వాత ఏదో ఊళ్లో బస్సాగింది. అప్పటికి ఆ ఊళ్ల పేర్లు నాకు తెలీవు. బహుశః సూర్యాపేట అయి ఉంటుందేమోనని ఇప్పుడనుకుంటున్నాను.

"టీ తాగుదాం కిందికి వస్తారా?" అనడిగాడు.

"అలవాటు లేదు. కాని,తోడు వస్తాను" అన్నాను.

ఇద్దరం కిందికి దిగాం.

ఆయన చార్మినార్ సిగరెట్ పెట్టె కొనుక్కున్నాడు. జేబులోని అగ్గిపెట్టె తీసి ఆడించి చూసి పుల్లలు తక్కువ ఉన్నట్లు అనిపించిందో ఏమో, ఒక అగ్గిపెట్టె కూడా తీసుకున్నాడు.

"మీకు సిగరెట్ అలవాటుకూడా ఉన్నట్టు లేదు" ఒక సిగరెట్ తీసి పెదాలకు తగిలించి అగ్గిపుల్ల గీస్తూ అన్నాడు.

అవునన్నట్టు చిరునవ్వు నవ్వాను.

"అందుకే బస్సులో మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక ఇక్కడే తగలేస్తున్నాను" అన్నాడు.

"అబ్బే! నాకేం అభ్యంతరం లేదండీ. భరించగలను."

"ఎందుకు భరించాలి? అనుభవించగలిగితే సరేసరి, భరించటం అంటే ఇష్టం లేని పని చేయడమేగా?"

ఆయన టీ తెప్పించుకుని తాగుతున్నాడు. కుడి చేతిలో తేనీటి గ్లాసు, ఎడం చేతి వేళ్ళ మధ్య సిగరెట్...

"ఇవి రెండూ ఉంటే చాలు మాకు. తిండిలేకపోయినా రోజులు నెట్టెయ్యగలం."

"మాకు అంటే?"

"బహువచన ప్రయోగం చేశాననా! అది ఇప్పటి మాట కాదులెండి. పార్టీలో పని చేసే రోజుల్లో. అప్పుడు మాకు వేళపాటున తిండి ఉండేదికాదు."

"అంటే మీరు కమ్యూనిస్టా?" అనడిగాను కుతూహలంగా.

"మరి? మరో పార్టీ అయితే 'టీ'లూ, సిగరెట్లూ తాగి పడిఉండాల్సిన కర్మమేం పట్టింది?"

"అయితే మీరిప్పుడు పార్టీలో లేరా?"

"లేను. అడిగిన అన్ని చీలిక వర్గాలకీ చందాలిచ్చి సంతృప్తి పడుతున్నాను."

"అంటే?"

"అంటే ఏవిటో వేరే చెప్పనక్కర్లేదనుకుంటాను. మీరు చదువుకున్న వారిలా అవుపిస్తున్నారు. చరిత్ర గతిని సూక్ష్మదృష్టితో పరిశీలించగలరు. మీరే చెప్పండి, ప్రజా జీవితంలో కమ్యూనిస్టుల పాత్ర ఏవి టిప్పుడు? ప్రజల ఆశల్ని వమ్ముచేసి

సిద్ధాంత చర్చలో పడి విస్తరి చించుకు బతుకుతున్నవాళ్ళు వీళ్ళు. అలాంటప్పుడు నాలాంటి కార్యకర్తల అవసరం ఏమి ఉంది చెప్పండి. నేనా సిద్ధాంత చర్చలు చేయలేను. ఉన్న బతుకు తెరువు పంతులు ఉద్యోగం ఎప్పుడో వదులుకున్నాను.''

కండక్టరు బెల్లు కొడుతున్నాడు. డ్రైవరు హారన్ మోగించి పిలుస్తున్నాడు. సిగరెట్ పారేసి బస్సు వైపు కదిలాడు. ఆయన వెనక నేనూ.

మళ్లీ బస్సు కదిలింది.

"అడగటం మరిచాను. ఇంతకీ ఎంతవరకూ మీరు?'' అనడిగాడు రాఘవయ్య గారు సీట్లో సర్దుకు కూర్చుంటూ.

"హైదరాబాదు.''

"నేనూ హైదరాబాదే. మీరు ఉండేది అక్కడేనా లేక పనిమీద వెళ్తున్నారా?''

"ఇంటర్వ్యూకి వెళ్తున్నాను. హైదరాబాదు వెళ్లడం నాకు ఇదే మొదటిసారి.''

"అలాగా! ఎవరైనా తెల్సినవారున్నారా?''

"లేరు. ఏదన్నా హోటల్లో దిగాలి. అదీ ఎక్కడ దిగాలో తెలీదు."

"ఫర్వాలేదు లెండి నాతో వద్దురు గాని, మీకు వసతికి ఏమీ లోటు ఉండదు.''

"అబ్బే అక్కర్లేదండీ...''

"చూడండి... మీరు నా దగ్గర మొహమాటపడితే మీ అమ్మ దగ్గరో, నాన్న దగ్గరో మొహమాట పడినట్లే.''

ఆ మాటతో ఆయనతో వెళ్ళటానికే నిశ్చయించుకున్నాను.

"బస్సు దిగాక చాలా దూరం వెళ్లాలి. సిటీ బస్సులు ఉంటా యనుకోండి. కాని, ఇంత వేకువనే రావు'' అని ఆటో ఎక్కించి తీసికెళ్లాడు.

ఆయనచెప్పినట్టే ఊరికి చాలా దూరంగా ఉంది ఆయన మకాం. ఏడెనిమిది ఎకరాల స్థలం మధ్యలో బంగాళా పెంకుతో ఒక ఇల్లు. చుట్టూ ముళ్ల తీగతో బందోబస్తు చేశాడు. నాలుగైదెకరాల్లో ద్రాక్ష తోట కోతకు సిద్ధంగా ఉంది. మిగతా స్థలంలో రకరకాల కూరగాయలు, పాదులూ, చెట్లూ ఉన్నాయి.

"ఇదే నా బతుకు తెరువు'' తోటవైపు చూపిస్తూ అన్నాడు.

ఆ తోట, ఆ వాతావరణం చూస్తే అది అతని బతుకు తెరువులా లేదు. ఎందరి బతుక్కో తెరువు చూపించేదిలా ఉంది.

బంగ్లా అరుగుమీదికి వెళ్లాము. అది చిన్నదేఅయినా అన్ని సౌకర్యాలూ ఉన్నట్లున్నాయి. పక్కనే బావి. బావిలో నీరు తోడటానికి పంపు సెట్టు అమర్చి ఉంది.

"యాదగిరీ!"

ఎవర్నో పిలిచాడు రాఘవయ్య గారు.

ద్రాక్ష తోట మధ్యలోంచి ఒక కంఠం పలికింది.

"అతనే నాకు అన్ని విధాల తోడు. పేరు యాదిరెడ్డి. నేనే కులం పేరు తీసేసి యాదగిరి అని పెట్టాను. పేరు మార్చుకున్నంత మాత్రాన కులాలు మాసిపోతాయని నా అభిప్రాయం కాదు. కనీసం పేరు వినగానే కులం ఏమిటో తెలీకుండా ఉంటుందని?"

"ఏంటన్నా?" అంటు వచ్చి నిలబడ్డాడు యాదగిరి.

"చూడూ! ఈయన మన మిత్రుడు. ఆయనకి కావల్సిన ఏర్పాట్లన్నీ చూడు" అని చెప్పాడు.

"స్నానం చేస్తారా?" అనడిగాడు యాదగిరి.

"కొంచెం సేపాగాక" అన్నాను.

"అయితే కూర్చోండి." తను కూర్చుంటూ నాకో కుర్చీ చూపించాడు రాఘవయ్యగారు.

"ఇంటర్వ్యూ ఎప్పుడన్నారు?"

"రేపే".

"ఎక్కడ?"

చెప్పాను.

"మరేం ఫర్వాలేదు. తప్పకుండా వస్తుంది" అన్నాడు.

ఆయన ఎవరికి ఏ విధంగా సిఫార్సు చేశాడో తెలీదు గానీ ఆ ఉద్యోగం మాత్రం నాకే వచ్చింది.

అలా హైదరాబాద్‌లో స్థిరపడిపోయాను.

ఉద్యోగంలో చేరిన తర్వాత రాఘవయ్యగారి దగ్గరకు తరచు వెళుతూ ఉండేవాడిని. ఆయన చాలా ఆప్యాయంగా ఆహ్వానించి కుటుంబ సభ్యుడిలాగా ఆదరించేవాడు. ఆయనతో అనుబంధం పెరిగేకొద్దీ అనుమానాలుకూడా ఎన్నో తలెత్తేవి.

ఆయన అవివాహితుడా?

ఏకాకిగా ఎందు కుంటున్నాడు?

ఇలా ఎన్నో అనుమానాలు. కాని ఎన్నడూ ఆయన్ని అడిగే సాహసం చేయలేదు. అడక్కపోయినా ఆయన పసిగట్టకపోలేదు. ఆయన అతి సూక్ష్మగ్రాహి. ఒక రోజున చెప్పాడు.

"నా జీవితం గురించీ, నాగురించీ మీకెన్నో అనుమానాలున్నాయని నేను గ్రహించాను. మీరు అడగటానికి మథన పడుతున్నారనీ అర్థం చేసుకున్నాను. ఇది దాచుకోవల్సిన రహస్యం ఏమీ కాదు. అందులోనూ మీలాంటి సన్నిహితుల దగ్గర దాచుకోవాల్సిన రహస్యం అంతకంటే కాదు."

నేను మాట్లాడలేదు.

"నాకు పెళ్లయింది. అనుకూలవతి అయిన అమ్మాయితోనే పెళ్లయింది. కాని తర్వాత విడిపోయాము."

ఆయన ముఖంలోకి చూశాను.

ఆయన కూడా గ్రహించినట్టున్నాడు.

"భార్య అనుకూలవతి అన్నారు - విడిపోవటం ఏవిటనికదూ మీ ప్రశ్న" అన్నాడు.

"అబ్బే! అది కాదు."

"నాకు తెల్సులెండి. మీకే కాదు, ఎవరికైనా అలాంటి ప్రశ్న ఎదురవుతుంది. దానిక్కూడా సమాధానం చెబుతాను."

"నేను పార్టీ పనిలో తలమునకలై నెలల తరబడి ఆమె ముఖం కూడా చూసేవాడిని కాదు. అయినా ఆమె భరించింది. తర్వాత పార్టీని నిషేధించారు. అప్పుడు రహస్య జీవితం గడుపుతూ పొరుగు రాష్ట్రం అయిన ఒరిస్సాలో తలదాచుకున్నాను. దిన దిన గండంగా మారిన రహస్య జీవితంలో ఆమెను నా దగ్గరపెట్టుకోవడం సాధ్యం కాలేదు. అంచేత పుట్టింటి దగ్గరే వదిలేశాను."

"ఆమె చాలా కాలం ఓపిక పట్టింది. తర్వాత ఆమెకు నచ్చిన వ్యక్తిని పెళ్ళి చేసుకుంది."

"ఆమె చేసింది తప్పని ఇప్పటికీ నేను అనుకోవటంలేదు. మానవ సహజమైన పనే చేసింది. శారీరక అవసరాలు మనిషిని ఎంతగా హింసిస్తాయో నేను ఎరుగుదును. అందంగానూ, పరువంలో ఉన్న యువతి కోర్కెల్ని చంపుకుని జీవచ్ఛవంలా పడిఉండాలని ఏ మూర్ఖుడూ కోరుకోడు."

"పార్టీమీద ప్రభుత్వం నిర్బంధం తొలగించాక రహస్య జీవితంనుంచి బయట పడ్డాం. ఊళ్లోకి రాకమునుపే నాకు ఆమె విషయం తెలిసింది. ఇంక అక్కడుండటం ఇష్టంలేక ఉన్న కాస్త పొలం అమ్మేసుకుని ఇక్కడ ఈ భూమి కొన్నాను. ఇక్కడికి వచ్చాక కూడా కొంత కాలంపాటు నల్లగొండ జిల్లాలో పార్టీ పని కొనసాగించాను. తర్వాత పార్టీ ముక్క చెక్కలైపోయింది. విసుగెత్తి ఇక పూర్తి జీవితం వ్యవసాయానికే

అంకితం చేశాను.''

“ఇదీ నా జీవితం...''

“మీ ఒక్కరి కోసం ఎందుకీ తాపత్రయం'' అని అడిగాను.

“నేను ఒక్కడినే అని ఎన్నడూ అనుకోలేదు. నా చుట్టూ సమాజం ఉంది. నా కష్ట ఫలితం ఆ సమాజానిక్కూడా అందుతుంది.''

“మీ తర్వాత?''

“ఇదీ ముందు ప్రశ్న లాంటిదే. అయినా ఇదుగో ఉన్నాడుగా. నా కొడుకైనా, మిత్రుడైనా యాదగిరే. అతడే దీనికి వారసుడు'' అన్నాడు.

అప్పుడు యాదగిరి అక్కడ లేడు. అతడు ఉన్నా లేకపోయినా ఇలాంటి మాటలు అతను విన్నా వినకపోయినా యాదగిరి రాఘవయ్య గారికి చేస్తోన్న సేవ అలాంటిదే.

మరొక్కసారి రాఘవయ్యగారి దగ్గరికెళ్లాను. అప్పుడాయన నిక్కరూ, బనియనూ వేసుకుని ద్రాక్ష తోటకి ఏదో క్రిమిసంహారక మందు చల్లుతున్నాడు.

“ఏమిటండీ ఈ వయసులో మీరీ పని చేస్తున్నారు'' అనడిగాను.

“ఏం చేసేది? పని వాళ్లంతా కలిసికట్టుగా ఒక్కసారే ఎగనామం పెట్టారు. నేను చేయి చేసుకోకపోతే తోట ఎందుకూ పనికిరాదు''.

“మీ వారసుడు ఉన్నాడుగా?''

“మీకు తెలీదేమో.. ఈ మధ్య మా వారసుడు చాలా బిజీ అయిపోయాడు'' అన్నాడు నవ్వుతూ.

“అంటే?''

“అంటే ప్రేమలో పడ్డాడు. నేనూ కాదనటంలేదు. ఏ వయసులో జరగాల్సినవి ఆ వయసులోనే సహజంగా జరగాలి.''

“అందుకని?''

“చెట్టాపట్టాలేసుకుని సుల్తాన్ బజారు దాకా షికారెళ్లారు.''

“ఇంత అర్జెంటు పని వదిలేశా?''

“దాని లక్షణమే అది కదండీ! అది వయస్సు చేసే గమ్మత్తు. దాన్ని ఆపటం మన తరమా?''

“ఏవిటి ఈయన భావాలు? ఈయన హృదయం ఇంత విశాలమైందా? అని ఆశ్చర్యపోయాను.

ఆ తర్వాత చాలా రోజులవరకూ అటు వెళ్లలేదు.

ఒక రోజున ఆకస్మాత్తుగా యాదగిరి పెళ్లి శుభలేఖ వచ్చింది. అది చూసి ఏమీ ఆశ్చర్యపడలేదు. రాఘవయ్యగారే ఈ పెళ్లి జరిపిస్తున్నారు.

పెళ్లికి వెళ్లాను.

దండల పెళ్లి అయినా అట్టహాసంగా చేశాడు రాఘవయ్య గారు. అమ్మాయి అందంగానే ఉంది. ఆ గ్రామంలోనే ఒక చిన్నకారు రైతుబిడ్డ.

ఇద్దర్నీ తన దగ్గరే పెట్టుకున్నాడు రాఘవయ్యగారు.

యాదగిరి పెళ్లయ్యాక అక్కడికి వెళ్లడం తగ్గించేశాను.

కొన్ని రోజుల తర్వాత పిడుగు లాంటి ఈ దుర్వార్త తెలిసింది. వెంటనే వెళ్లాను.

రాఘవయ్య గారి మృత దేహాన్ని చూడలేక పోయాను. బంగ్లా వరండాలో మడత మంచం మీద ఆయన శరీరం ఉంది. పీక తెగి తల కిందికి వేళ్లాడుతోంది. నెత్తురు నేల మీదికి కారి మడుగులా ఏర్పడింది. నరికిన గొడ్డలి అక్కడే పడిఉంది.

నేను వెళ్లేప్పటికి ఊరి జనం అంతా అక్కడ మూగి ఉన్నారు. పోలీసులు శవం దగ్గరికి ఎవరూ రాకుండా కాపలా ఉన్నారు.

యాదగిరి నన్ను చూడగానే వాటేసుకుని భోరు మన్నాడు. నాకు ఏం చేయాలో తోచలేదు. అంతా అయోమయంగా ఉంది. ఆ దుఃఖంలో అతన్ని ఓదార్చవల్సిన బాధ్యత నా మీద ఉంది. కాని, ఎలా ఓదార్చను? ఏమని ఓదార్చను? నన్ను నేనే ఓదార్చుకోలేని దుర్ఘటనఅది. మౌనంగా దుఃఖించటం తప్ప ఏమీ చేయలేకపోయాను.

అక్కడ చేరిన వాళ్లంతా రాఘవయ్యగారి హత్యకు కారణాలు రకరకాలుగా చెప్పుకుంటున్నారు. అవేం నా తలకెక్కటం లేదు. నా మనస్సంతా శూన్యంగా ఉంది.

యాదగిరిని గోడకి చేర్చి కూర్చోబెట్టి, నేనూ అతనికి పక్కగా కూర్చున్నాను. యాదగిరి ఎడతెరిపి లేకుండా రోదిస్తున్నాడు.

ఇంతలో పోలీస్ వేన్ ఒకటి లోపలికి వచ్చింది. అందులోంచి పోలీసు కుక్కలూ, వాటి గొలుసులు పట్టుకుని పోలీసులూ దిగారు.

గొడ్డలిమీద వేలి ముద్రలు పరీక్షించక ముందే కుక్కల్ని రంగంలోకి దించారు పోలీసులు. అవి రాఘవయ్య గారి మంచంచుట్టూ రెండుసార్లు తిరిగి బయటికి పరిగెత్తాయి. వాటి గొలుసులు పట్టుకుని పోలీసులూ వాటి వెంట పరుగెత్తారు.

ఆత్రుతగా లేచి నేను వెంటపడ్డాను. నాతోబాటు యాదగిరి లేచివచ్చాడు.

"జంగమ్మ ఇక్కడ లేదా?" అనడిగాను ఎంతకూ అతని భార్య అక్కడ కనిపించక పోవడంతో.

"ఇక్కడ లేదు. భయపడతాదని పుట్టింట్లో ఒదిలి ఒచ్చినా" అన్నాడు.

ఆ తర్వాత మా మధ్య మాటల్లేవు.

కుక్కలు అలా పరుగెడుతూనే ఉన్నాయి. గ్రామానికి అడ్డం పడి పరుగెడుతున్నాయి. గ్రామంలోని మూక వాటితోపాటు పరుగెడుతున్నారు. పోలీసులు అప్పుడప్పుడూ వాళ్లని అదుపులో పెట్టాల్సి వస్తోంది.

మేం నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లేప్పటికి కుక్కలు యాదగిరి అత్త వారింట్లో దూరాయని తెల్సింది. అది తెల్సిన వెంటనే యాదగిరి అగ్గిమీద గుగ్గిలంలా మండిపడ్డాడు.

"నా అన్నను ఈళ్లే సంపిన్రు. యీళ్లను బతకనియ్యను" అంటూపరుగు తీశాడు. అతన్ని సముదాయిస్తూ నేనూ వెళ్లాను.

తీరా ఇంటికి వెళ్లేప్పటికి దృశ్యం వేరుగా ఉంది. పోలీసులు జంగమ్మ భుజాలు పట్టుకొని ఇంట్లోంచి బయటికి లాక్కొస్తున్నారు. ఆమెలో ఎలాంటి భావాలూ లేవు. నిర్వికారంగా ఉంది.

ఆ దృశ్యం చూసి నిశ్చేష్టుడైపోయాడు యాదగిరి. తర్వాత తేరుకుని కోపంతో ఊగిపోయాడు.

ఏ అవాంఛనీయ సంఘటనా జరక్కుండా యాదగిరిని గట్టిగా పట్టుకున్నాను.

జంగమ్మను పోలీసులు వేన్లోకి ఎక్కించారు.

*(ఆంధ్రప్రభ, ఆగస్టు 1994)*